క్లుప్తంగా

పీఆర్టీయూ కార్యాలయంలో సందడి

మధురపూడి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్టీయూ తరఫున పోటీ చేసిన గాదె శ్రీనివాసనాయుడు గెలుపొందడంతో సోమవారం కోరుకొండలోని సంఘ కార్యాలయంలో సందడి నెలకొంది. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు పల్లా రాజారావు మాట్లాడుతూ, రెండుసార్లు ఎమ్మెల్సీగా గెలిచిన శ్రీనివాసనాయుడు ఎన్నో ఉపయుక్తమైన జీవోలను అందించడానికి కృషి చేశారన్నారు. మూడోసారి విజయాన్ని అందుకోవడం గర్వంగా ఉందన్నారు. ప్రజా సమస్యలతో పాటు, మేధావుల సమస్యలపై పోరాడాలన్నారు. సంఘ ప్రతినిధులు ఆగ్నేష్, బి.సాంబశివరావు, రహీమ, శ్రీనివాస్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి, ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ సోమవారం తెలిపారు. తమకు అందిన సమాచారంతో పోలీసు సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.20,490 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 16 మంది గైర్హాజరు

రంగంపేట: మండల కేంద్రంలోని రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్ష జరిగినట్లు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్లు బి.హేమ, ఎస్.మాధురి తెలిపారు. రంగంపేట, రాజానగరం మండలాలకు చెందిన విద్యార్థులు మొత్తం 469 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 16 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. మంగళవారం ఫస్టియర్ ఇంగ్లిష్ పరీక్ష జరుగుతుందని తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 428 మంది హాజరు

మధురపూడి: కోరుకొండ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. పరీక్షలకు 428 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ పరీక్షలకు 337 మందిలో ముగ్గురు గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు 97కు 94 మంది హాజరయ్యారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అఖండ అన్న సమారాధన



అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

రాజానగరం: జాతీయ రహదారిని ఆనుకుని నరేంద్రపురం జంక్షన్‌లో ఉన్న ఈత చెట్టు ఈశ్వరుని మందిరం వద్ద సోమవారం అఖండ అన్న సమారాధన జరిగింది. మహా శివరాత్రి అనంతరం భక్తుల సహకారంతో నిర్వాహకులు భారీఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. రాజానగరంతో పాటు, పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పరమేశ్వరుని దర్శించుకుని, అన్న సమారాధనలో పాల్గొన్నారు.


లింగ వివక్షపై వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సీతానగరం: మండల కేంద్రంలోని సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని లింగ వివక్షను అరికట్టడం ప్రధానాంశంగా ఈ పోటీలు జరిగాయి. అధ్యాపకులు డాక్టర్ ఎం సుధామయి, ఎ.వెంకటేష్, వీవీ సుబ్బారావు, డాక్టర్ బి.మాధవ్ ఈ పోటీలను పర్యవేక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు, ఎస్సై డి.రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖరస్వామికి ప్రత్యేక పూజలు



చంద్రేడులో కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి

రంగంపేట: చంద్రేడు గ్రామంలో ఉన్న కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి దేవాలయంలో స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, వ్రత పూజలు జరిగాయి. అనంతరం స్వామివారిని సుందరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నూరేళ్ల పంట.. ఖర్చుకు తగ్గేదేలేదంట!

- వివాహాలకు గణనీయంగా పెరిగిన వ్యయం
- ఏటేటా పెరుగుతున్న బడ్జెట్
- భోజనాలు, బంగారం, దుస్తులకు అధిక వ్యయం
- కళ్లెం లేని ధరలే కారణం



వివాహానికి సిద్ధం చేసిన కల్యాణ మండపం

రంగంపేట: పెళ్లంటే నూరేళ్ల పంట అంటారు. మరి అలాంటి పంటకు ఖర్చు కాస్త దండిగానే అవుతుంది. ధనిక, పేదలనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ వివాహ వేడుక మరుపురాని జ్ఞాపకం. తమ ఇంట జరిగే వివాహ వేడుకను ఉన్నంతలో ఘనంగా నిర్వహించాలని ప్రతి ఒక్కరూ ఆశ పడతారు. గతంలో వధూవరుల ఆర్థిక స్తోమత ఆధారంగా పెళ్లిళ్లు జరగ్గా, ప్రస్తుతం పెరుగుతున్న ధరలతో ఆర్థికంగా భారమైనా ప్రతి ఒక్కరూ శక్తికి మించి ఘనంగా నిర్వహించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఎటుచూసినా పెళ్లిళ్ల సందడే..

మాఘ మాసంలో ఫిబ్రవరి 6 నుంచి ముహూర్తాలు ప్రారంభమయ్యాయి. జూన్ వరకు ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. జూన్ తరువాత ఆషాఢం, మూఢం ఉండడంతో, ఈలోగానే వివాహాలు చేసేయాలని ఆసక్తి చూపుతున్నారు.

నింగిలో నిత్యావసరాలు

ప్రస్తుతం సాధారణ భోజనం ప్లేటుకు రూ.250, కాస్త ఘనంగా పెట్టాలంటే రూ.850 నుంచి రూ.వెయ్యి వరకు ఖర్చు చేస్తున్నారు. ఇటీవల అల్పాహారం కూడా ట్రెండ్‌గా మారింది. దీనికి ప్లేటుకు రూ.180 వరకు వసూలు చేస్తున్నారు. పళ్ల రసాలు, శీతల పానీయాలు, చిరుతిండ్లు వంటివి అదనం. ఇక సారె, బహుమతుల ఖర్చు వేరే లెక్క.

మంటపాల్లోనే అధికం

గతంలో వరుడు లేదా వధువు ఇళ్ల వద్ద ఎక్కువగా వివాహాలు జరిగేవి. కాలానుగుణంగా కల్యాణ మంటపాల్లో వివాహాలు చేసుకోవడం ఇటీవల పరిపాటిగా మారింది. ఖర్చు ఎక్కువైనా శ్రమ తగ్గుతుందనే ఉద్దేశంతో మంటపాల్లో పెళ్లిళ్లు జరిపించేస్తున్నారు. అలాగే భోజనాలు కూడా ఎక్కువగా క్యాటరింగ్‌కే అప్పగిస్తున్నారు. అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో దాదాపు రెండొందల కల్యాణ మంటపాలున్నాయి. నాన్ ఏసీ కల్యాణ మంటపాల్లో పెళ్లికి రూ.50 వేల వరకు వసూలు చేస్తుండగా, ఏసీ కల్యాణ మంటపాలకు రూ.రెండు లక్షల వరకు వసూలు చేస్తున్నారు. సీజన్‌లోనైతే ఏసీ మంటపాల అద్దె రూ.మూడు లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకు ఉంటుంది. ఇంకా వీడియోలు, ఫొటో షూట్లకు లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సిందే.

పసిడి పైపైకి..

గతంలో పోలిస్తే బంగారం ధర పది గ్రాములు రూ.20 వేల వరకు పెరిగింది. సామాన్యులు ఓ వివాహానికి కనీసం 40 గ్రాముల బంగారమైనా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. సంపన్నులైతే 50 తులాల వరకు కొనుగోలు చేస్తున్నారు.

వస్త్రాలపై జీఎస్టీ పోటు

మధ్య తరగతి వారు వివాహానికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వస్త్రాల కొనుగోలుకు వెచ్చిస్తున్నారు. జీఎస్టీ కారణంగా ప్రస్తుతం ఈ తరహా కొనుగోళ్లపై అదనంగా మరో రూ.70 వేలు చెల్లించాల్సి వస్తోంది.

పువ్వుల ధరలకు రెక్కలు

పెళ్లితంతు నిర్వహించేందుకు ప్రత్యేకంగా వివిధ రకాల పువ్వులతో మందిరాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు. వీటికోసం రూ.లక్షల్లో వెచ్చించాల్సి వస్తోంది. గతంలో వీటిని తయారు చేసేవారు రూ.30 వేల నుంచి రూ.45 వేల వరకు తీసుకునేవారు. ప్రస్తుతం రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు.

వాయిద్యాల ఖర్చు మోత

గతంలో బ్యాండ్ పార్టీ కోసం రూ.30 వేల నుంచి రూ.45 వేల వరకు ఖర్చు చేసేవారు. ప్రస్తుతం ఇది రూ.లక్షకు చేరింది. తెల్లవారుజామున ముహూర్తం ఉంటే మ్యూజికల్ నైట్ పేరుతో ఏర్పాటు చేసే ప్రోగ్రాంకు రూ.లక్ష కేటాయించాల్సిందే. రకరకాలుగా ఖర్చులు పెరుగుతున్నా అందుకు తగ్గకపోవడం విడ్డూరం. సంప్రదాయబద్ధంగా తక్కువ ఖర్చుతో వివాహాలు జరిపించడం మేలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఖర్చులు తడిసి మోపెడు

పెళ్లికి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఒకరిని చూసి ఇంకొకరు అదనపు ఖర్చులు పెడుతున్నారు. వైభవంగా పెళ్లి కార్యక్రమాన్ని నిర్వహించాలనేది అందరి తాపత్రయం. ఇందులో భాగంగానే ఖర్చుల భారం పెరిగిపోతోంది.

– కె.వీర్రాజు, చంద్రేడు గ్రామం, రంగంపేట మండలం

శ్రీవారి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే దంపతులు



వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

పెదపూడి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండపేట మండలం అర్తమూరు గ్రామంలో సోమవారం జరిగిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి 17వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులను పిడపర్తి వెంకట రామశాస్త్రి (డీజీపీ, ఉత్తరప్రదేశ్), నీరజ శాస్త్రి(ఐఎఫ్ఎస్) ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సత్తి బులిస్వామిరెడ్డి దంపతులు, కర్రి బాపిరెడ్డి దంపతులు, రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పరిమి నాగసత్యప్రసాద్, శేషావెంకటలక్ష్మి దంపతులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో 'నన్నయ' విద్యార్థిని ప్రతిభ



నాగలక్ష్మితో వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ, ఇతర అధికారులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీకి చెందిన విద్యార్థిని కర్నాటి నాగలక్ష్మి జాతీయ స్థాయిలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్‌ని అందుకుంది. భీమవరంలోని డీఎన్ఆర్ కళాశాలకు చెందిన ఈ విద్యార్థిని ఫిబ్రవరి 14 నుంచి 17 వరకు హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో జరిగిన ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ ఉమెన్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో 87 కేజీల కేటగిరీలో సిల్వర్ మెడల్‌తో పాటు, ట్రోఫీని అందుకుందని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. గతేడాది జూనియర్ నేషనల్ పోటీల్లో కూడా సిల్వర్ మెడల్‌ని సొంతం చేసుకుందన్నారు. ఏప్రిల్‌లో గోవాలో జరిగే ఖేలో ఇండియా పోటీలకు ఎంపికై ందన్నారు. సోమవారం వీసీని కలిసిన నాగలక్ష్మిని వీసీ దుశ్శాలువాతో సత్కరించి, అభినందించారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని, ప్రభుత్వ ఉద్యోగం పొందాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావు, టీం మేనేజర్ ఎంవీఎస్ఎన్ మూర్తి, కోచ్ ఎం.రమేష్, రమణ పాల్గొన్నారు.

'నన్నయ'లో నేటి నుంచి నారీ ఫెస్ట్-2025

- వివిధ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు
- వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ



రాజానగరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో మూడు రోజుల పాటు నిర్వహించే నారీ ఫెస్ట్-2025 మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఇందులో మహిళలకు వివిధ విభాగాలలో పోటీలు ఉంటాయని, మహిళలంతా అధిక సంఖ్యలో పాల్గొని నారీ సత్తాను చాటాలని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. మంగళవారం యూనివర్సిటీ సెమినార్ హాల్‌లో హెల్త్ బేబీ పోటీలు జరుగుతాయని చెప్పారు. రాజమహేంద్రవరం, పరిసరాల్లోని ఐదేళ్లలోపు చిన్నారులు పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 63057 89433 నంబరులో సంప్రదించవచ్చన్నారు. అలాగే కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే బామ్మ-మనవరాలి ఫ్యాషన్ షోలో పాల్గొనే బామ్మల వయస్సు 60 నుంచి 80 ఏళ్ల ఉండాలని, మనవరాలి వయస్సు ఐదు నుంచి పదేళ్ల వరకు ఉండవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.150 చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వివరాలకు 99126 62500 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

క్యాంపస్‌లోని మహిళల కోసం..

అదే రోజు మహిళల కోసం కూడా ప్రత్యేక పోటీలు ఉంటాయని వీసీ తెలిపారు. యూనివర్సిటీతో పాటు, తాడేపల్లిగూడెం, కాకినాడ క్యాంపస్‌ల్లోని విద్యార్థినులు, ఉద్యోగినులు ఇందులో పాల్గొనవచ్చన్నారు. గ్రూప్ సింగింగ్, ఫ్యాషన్ షో, స్కిట్, డాన్స్ వంటి పోటీలు ఉంటాయన్నారు. ఫ్రీ రిజిస్ట్రేషన్ అని, స్థానిక పాఠశాలల్లో కూడా పోటీలు నిర్వహించవచ్చన్నారు.

అనుబంధ కళాశాలల సిబ్బందికి..

రెండో రోజు మార్చి 5న యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న గోదావరి జిల్లాల్లోని కళాశాలల సిబ్బందికి వివిధ పోటీలు ఉంటాయని వీసీ తెలిపారు. సృనాత్మకతతో కూడిన వస్తువుల తయారీపై పోటీలు జరుగుతాయన్నారు. రూ.వంద చెల్లించి, రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ నెల ఆరున జరిగే నారీ ఫెస్ట్-2025లో భాగంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేస్తారన్నారు. యూనివర్సిటీ ఉమెన్ సెల్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

సీతానగరం: శ్రీరామకృష్ణ మఠం, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి సంయుక్తాధ్వర్యంలో స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆశ్రమంలో డాక్టర్ యన్నమనేని రామచంద్రరావు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ సత్యం రమేష్‌బాబు మొత్తం 246 మందికి వైద్య సేవలు అందించారు. శ్రీరామకృష్ణ మఠం ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరంలో 198 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి వారు ఉచిత కంటి వైద్య శిబిరంలో 48 మందికి పరీక్షలు నిర్వహించారు. నలుగురికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ఉచిత ఆపరేషన్ల కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి సుశీల, యన్నమని వెంకటనారాయణ, రిటైర్డ్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జి.రామారావు, మట్ట వసంతరావు, చంటిబాబు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బొబ్బిల్లంక హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న బొబ్బిల్లంక స్కూల్ విద్యార్థులు

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. సోమవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీలో బొబ్బిల్లంక హైస్కూల్ విద్యార్థులు వై.నాగమహేష్, పి.రెవిల్‌బాబు జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానం సాధించారు. వీరికి డీఈఓ వాసుదేవరావు మెరిట్ సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన సైన్స్ ఉపాధ్యాయుడు జీవీ మోహన్‌రావును హెచ్ఎం కోలా సత్యనారాయణ, గ్రామ పెద్దలు అభినందించారు.

త్రిముఖ లింగేశ్వరునికి ప్రత్యేక పూజలు



కొంకుదురులో త్రిముఖ లింగేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు బుడిత మామిడి వద్ద కొలువైన బాలాత్రిపుర సుందరి సమేత త్రిముఖలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఫాల్గుణ మాసం సోమవారం సందర్భంగా ఈ పూజల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది.

వన్య ప్రాణులను సంరక్షించాలి

ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ మూర్తి



మొక్క నాటుతున్న ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ మూర్తి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): పర్యావరణంలో కీలకమైన వన్య ప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ బీఎస్ఎస్ మూర్తి అన్నారు. వన్య ప్రాణి సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం శ్రీషిర్డీసాయి విద్యాసంస్థల ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పర్యావరణ వ్యవస్థలో అడవులు, వన్య ప్రాణులు భాగమని, విస్తృత ఆహార వలయం సక్రమంగా సాగాలంటే వీటి మనుగడ తప్పనిసరని వివరించారు. అడవులు నానాటికీ తగ్గిపోతున్నాయని, అందువల్ల భూమిపై సమతుల్యత దెబ్బతిని.. అధిక ఉష్ణోగ్రతలకు, తద్వారా వన్య ప్రాణుల హానికి కారణమవుతోందని విశ్లేషించారు. ప్రతి ఒక్కరూ చెట్లను పెంచడం ద్వారా కొంతవరకు ఈ సమతుల్యతను కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థులు రాష్ట్రాలను ప్రతిబింబించేలా భారత దేశ పటం రూపంలో ఏర్పడ్డారు. విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ మాట్లాడుతూ, వాతావరణ మార్పులు, కాలుష్యం కూడా వన్య ప్రాణులు అంతరించిపోవడానికి కారణమవుతున్నాయన్నారు. కళాశాల ఆవరణలో మూర్తితో పాటు, యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలను నాటారు.

8న పీఓడబ్ల్యూ విలీన సభ



పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

రాజానగరం: ఒంగోలులో ఈ నెల 8న జరిగే ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) విలీన సభను విజయవంతం చేయాలని సంఘ జిల్లా కార్యదర్శి బచ్చల శ్రీదేవి విజ్ఞప్తి చేశారు. మండలంలోని సూర్యారావుపేటలో ఉన్న అఖిల భారత రైతు కూలీ సంఘం కార్యాలయంలో ఈ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం పీఓడబ్ల్యూ నిరంతరం పోరాడుతుందన్నారు. 2013లో రెండుగా చీలిపోయిన ఈ సంస్థను బలోపేతం చేయడం అవసరమని భావించి, విలీనం చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో సంఘ డివిజన్ ప్రతినిధులు మరుకుర్తి వీరలక్ష్మి, బొలిశెట్టి సత్యవతి, తుమ్మల కళావతి, గోర్స దుర్గ తదితరులు పాల్గొన్నారు.

వేసవి తాపం.. మొక్కలకు దాహం

- నర్సరీలకు సమస్య
- నీరందించే పనిలో రైతులు తలమునకలు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి



కడియపులంకలోని ఓ నర్సరీ

కడియం: వేసవి వస్తోందంటే కడియం ప్రాంత నర్సరీ రైతాంగానికి కంటిమీద కునుకుండదు. నర్సరీల్లో మొక్కలను ఎండ తీవ్రత నుంచి కాపాడుకునేందుకు సర్వప్రయత్నాలు చేయాల్సి వస్తుంది. సమయానికి నీటిని అందించడంతో పాటు, ఎండ తీవ్రత బారిన పడకుండా మొక్కలకు షేడ్‌నెట్లు ఏర్పాటు చేయడం వరకు రేయింబవళ్లు కనిపెట్టుకునే ఉంటారు. ప్రస్తుతం ఎండలు ముదురుతుండడంతో రైతులు ఆయా పనుల్లో నిమగ్నమయ్యారు. షేడ్/సెమీ షేడ్ నెట్లు ఏర్పాటు చేయడంతో పాటు, తగు మోతాదులో నీటిని అందించడం వంటి పనుల్లో బిజీగా ఉన్నారు. పగటిపూట ఎండ తీవ్రత, రాత్రిపూట మంచు కారణంగా విచిత్రమైన వాతావరణం ప్రస్తుతం నెలకొంది.

ప్రయత్నాలు ముమ్మరం

ఏటా వేసవి తాపం నుంచి మొక్కలను కాపాడుకునేందుకు చేసే రైతులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇప్పటికే విలువైన మొక్కలకు నీడనిచ్చే అవిసె గింజలను నాటడంతో పాటు, మొక్కజొన్న వంటి అంతర పంటలపైనా దృష్టి పెట్టారు. ఏపుగా పెరిగే ఈ మొక్కల కారణంగా వీటి కింద ఉండే నర్సరీ మొక్కలు ఎండ తీవ్రత నుంచి తప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. లోడ్ రిలీఫ్, ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్, లైన్ రిపేర్ సర్వీసెస్ తదితర కారణాలతో విద్యుత్ కోతలు కూడా ప్రస్తుతం ప్రారంభమయ్యాయని రైతులు అంటున్నారు. పదేపదే విద్యుత్ సరఫరా ట్రిప్ అవుతుండడంతో మోటార్లను కనిపెట్టుకుని ఉండాల్సి వస్తోందని చెబుతున్నారు.

కూలీల కొరత

వేసవి ఎండ తీవ్రత మొదలైందంటే నర్సరీ రంగానికి కూలీల కొరత కూడా వేధిస్తుంది. ఎండ ధాటికి పనులు చేయలేక, కూలీలు కూడా పనులకు రాని పరిస్థితి ఉంటుంది. దీంతో ప్రత్యామ్నాయాలపై కూడా రైతులు దృష్టి పెడుతున్నారు. రెయిన్‌గన్‌లు, స్ప్రింక్లర్లు తదితర సూక్ష్మ నీటి పారుదల వ్యవస్థలపై వైపు కూడా రైతులు చూస్తున్నారు. గతంలో సబ్సిడీలపై ఆయా మైక్రో ఇరిగేషన్ పథకాలు అమలయ్యేవి. ప్రస్తుతం ఇప్పటి వరకు వీటికి సంబంధించి కచ్చితమైన విధివిధానాలను కూటమి ప్రభుత్వం ప్రకటించలేదని రైతులు అంటున్నారు. సోలార్ మోటార్లు, డ్రిప్, స్ప్రింక్లర్లు, రెయిన్‌గన్స్ తదితర సంప్రదాయేతర నీటి పారుదల వ్యవస్థలను నర్సరీ రంగ రైతులకు అందుబాటులోకి తీసుకువస్తే, వేసవి ఎండల సమయంలో ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని రైతులంటున్నారు.



నర్సరీలో మొక్కలకు నీటిని అందించేందుకు చేసిన ఏర్పాటు

వేసవిలో ప్రత్యేక శ్రద్ధ అవసరం

మొక్కల ఎదుగుదల వేసవిలో బాగుంటుంది. అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సమయానికి తగు మోతాదులో నీటిని అందించాలి. లేకపోతే మొక్కలు చనిపోతాయి. ఎండ ధాటికి తోడు, భూమి కూడా కాలుతుంటుంది. ఈ కారణంగా ఎప్పటికప్పుడు మొక్కలను పరిశీలించి, నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి.

– కేవీ మణికంఠ, నర్సరీ రైతు, బుర్రిలంక

ఒక్క ఎంఎన్‌వోకి 8 వార్డులా..!

ఆర్ఎంవోకు నాయకుల ఫిర్యాదు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో ఎంఎన్‌వో(మేల్ నర్సింగ్ ఆర్డర్లీ), జీడీఏ(జనరల్ డ్యూటీ అటెండర్) విధుల కేటాయింపు వ్యవహారం వివాదాస్పదమైంది. ఒక్క ఎంఎన్‌వోకి 8 వార్డుల్లో డ్యూటీలు కేటాయించడం, మరో ఎంఎన్‌వో నేరుగా ఆర్ఎంవో వద్దే ఐదేళ్లుగా కొనసాగుతుండడం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో విధుల కేటాయింపుల్లో చోటుచేసుకుంటున్న తప్పిదాలపై జీజీహెచ్ కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సోమవారం ఆస్పత్రి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆర్ఎంవో ప్రణవ్‌ను కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ, సూపర్‌వైజర్‌గా కొనసాగుతున్న సీనియర్ ఎంఎన్‌వో రోస్టర్‌ను పాటించకుండా, స్వప్రయోజనాల కోసం ఇష్టానుసారంగా డ్యూటీలు వేస్తున్నారని ఫిర్యాదు చేశారు. గతంలో అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఈయనను ఆ బాధ్యతల నుంచి తప్పించి, మళ్లీ సూపర్‌వైజర్ బాధ్యతలను ఆయనకే ఇచ్చారని ఆర్ఎంవో దృష్టికి తీసుకువెళ్లారు. ఐదేళ్లుగా ఒకే స్థానంలో ఓ ఎంఎన్‌వో కొనసాగుతుంటే, అధికారులు పట్టించుకోకపోవడం వారి పర్యవేక్షణా లోపాన్ని తేటతెల్లం చేస్తుందన్నారు. మరో వైద్యుడి వద్ద ఇద్దరు జీడీఏలు రెండేళ్లుగా ఒకే స్థానంలో కొనసాగుతున్నారని తెలిపారు. కొందరు రెగ్యులర్ ఉద్యోగులు ఎంఎన్‌వోలుగా ప్రమోషన్ తీసుకున్నా ఆ విధులు నిర్వర్తించకుండా, అంతకు ముందు విధుల్లోనే కొనసాగుతున్నారన్నారు. అలాగే ఓ ఎంఎన్‌వో తన కుమారుడిని ఆస్పత్రిలో విధుల్లో కొనసాగేలా చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. డ్రగ్స్ స్టోర్‌లో పనిచేస్తున్న పలువురు ఎంఎన్‌వోలను, జీడీఏలను మందుల పెట్టెలు మోసేందుకు వినియోగించడం ఏ మాత్రం సబబు కాదన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల పీఆర్‌వోలు ఆస్పత్రిలోకి అనధికారికంగా ప్రవేశించి కేసులను తరలిస్తున్నారని, వారికి సూపర్‌వైజర్ అండదండలు పుష్కలంగా ఉండడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు విన్న ఆర్ఎంవో డాక్టర్ ప్రణవ్ తక్షణమే సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభకు నివేదించి, చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పేద రోగులకు నాణ్యమైన సేవలు అందించడంలో నిబద్ధతను విడిచిపెట్టి, స్వప్రయోజనాలు ఆశించే ఏ ఒక్కరినీ సహించేది లేదని స్పష్టం చేశారు.